



ఎంత గొప్ప శాస్త్రమైనా కేవలం విశ్వాసంగా మారిపోయినప్పుడు అందులో శాస్త్రం చనిపోయి కేవలం మూఢత్వమే మిగులుతుందని నా విశ్వాసం. వాస్తుశాస్త్రం శాస్త్రీయమైనదే.

అయితే ఆ శాస్త్ర మౌలిక తత్వ పరిజ్ఞానం యివాళ ఎంతమందికి వుంది? అందుచేత వాస్తు పేరిట చెప్పే మూఢవిషయాలపై నాకే మాత్రం గౌరవ విశ్వాసాలు లేవు.

అయితే మా ఆవిడ జీవిత

(మిగతా కథ 74వ పేజీలో)

దృక్పథానికి విశ్వాసమే పునాది. మార్క్సిస్టులు దేముడు లేడని మూఢంగా విశ్వసించినట్లు, మా సులోచన దేముడే తన జీవితాన్ని నడుపుతున్నాడని మూఢంగా విశ్వసిస్తుంది. శకునాలు, జ్యోతిష్కులు, వాస్తు, బాబాలు, మహాత్ములు .. అన్నిటినీ తనకి అనుకూలమైతే విశ్వసిస్తుంది. లేకపోతే 'ఎలా వ్రాసిపెట్టివుంటే అలా జరుగుతుంది. మనచేతిలో ఏముంది?' అంటూ కర్మ సిద్ధాంతాన్ని ఆశ్రయిస్తుంది. మంచిని తప్ప చెడుని చూడని తత్వం ఆమెది.

అలా మా బుద్ధి కొలతల్లో చాలా వ్యత్యాసమున్నా మా దాంపత్య జీవనం సుఖంగానే నడుస్తోందంటే కారణం సులోచన మంచితనం. ఆమె విశ్వాసాలను మార్చాలని నేనెన్నడూ ప్రయత్నం చేయలేదు. సులోచనే నన్ను బాగు చేద్దామన్న తాపత్రయంలో కమ్యూనిస్టు ప్రచార పద్ధతుల్ని వుపయోగించింది కొన్నాళ్ళు. నేను 'బండవాడిని, మొండివాడిని' అని గ్రహించి ప్రచారాన్ని మానేసింది.

అలాంటి మా దాంపత్య జీవితంలో అద్దెయిల్లు మనస్పర్థలు సృష్టించింది!

మేము అద్దెకుండే యిల్లు ఎన్నడో నలభై ఏళ్ళక్రితం కట్టిన పాత మేడ. మూడు పోర్షన్లు. ఇంటి యజమాని మద్రాసులో వుండటంవల్ల మేనేజ్‌మెంట్ నా మీదే పడింది.

ఇంటి యజమాని వాళ్ళ తండ్రి, యిల్లు కట్టించిన ఆరునెలల్లో చనిపోయాట్ట! అందుకే ఆయన కొడుకు యిక్కడ వుండటం యిష్టంలేక మద్రాసుకు వెళ్ళాడుట! రెండేళ్ళు ఆ యింట్లో వున్నాక ఓ రోజు సులోచన యీ చరిత్ర మోసుకొచ్చింది. నేను మాట్లాడలేదు.

రిటైరయ్యాక ఎక్కడ స్థిరపడేది ఆలోచిస్తున్నానని రాసేడు యజమాని. "అం-వాళ్ళు యిక్కడికి రాకేం? మీకు నమ్మకాలు లేవని నోరు నొక్కుకొన్నాను కాని, యీ యింటి వాస్తు మంచిది కాదుట. వూరంతా అనుకొంటున్నారు." సులోచన మళ్ళీ అంది.

ఇంట్లోకి పుష్కలంగా గాలి వెలుగు వస్తుందాయె! వాస్తు బాగుండటం అంటే అంతకన్నా ఏమిటో? పనిలేని అమ్మలక్కలు

పుకార్లు పుట్టిస్తుంటారు. పిచ్చి సులోచన! ఎవరేం చెప్తే అది నమ్మేస్తుంది.

యజమాని రిటైరయ్యాడు. మద్రాసులో యిల్లు అమ్మేసి యిక్కడకే వచ్చి స్థిరపడ్డామని నిర్ణయించుకొన్నట్లు వ్రాసేడు. మిగతా రెండు పోర్షన్ల వాళ్ళని ఖాళీ చేయించి వ్రాయమన్నాడు.

"ఇప్పుడేమంటావ్?" అని సులోచనను ఛాలెంజ్ చేయలేదు నేను. 'మనమే ఖాళీ చేద్దామండీ' అని సులోచన పోరు పెట్టలేదు.

మిగతా రెండు పోర్షన్ల వాళ్ళు ఖాళీ చేశారు.

హఠాత్తుగా యింటి యజమాని మరణించినట్లు వుత్తరం వచ్చింది.

* * *

"ఏమండీ! ఓ చిన్న కోరిక కోరుతాను. తీరుస్తానని మాట యివ్వరూ?"

సినిమాకెళ్దామనికూడా ఎప్పుడూ తనంత తాను నోరు తెర్చి కోరని మనిషి- జ్వరానపడి నేను మంచంలో వుండగా సులోచన కోరే కోరిక ఏమిటి?

నేను గుండ్రాయి లాంటి మనిషిని. అలాంటిది యీ మధ్య ఆరోగ్యం బాగుండటం లేదు. డాక్టర్‌కు చూపిస్తే జబ్బేం లేదంటాడు. ఈమధ్య చిన్న ఆపరేషన్ చేయించుకొన్నాను. 'వూండ్' సెప్టెక్ అయి గంద్రగోళం చేసింది. యీలోగా యీ జ్వరం!

"మనం యీ యిల్లు ఖాళీ చేసి మరో యింటికి పోదామండీ! నా కెందుకో భయంగా వుంది. ఇక్కడి కొస్తానన్న యజమాని...."

సులోచన మనసులోకి అనుమానం అన్న దయ్యం ప్రవేశించింది. భయమనే భూతంగా మారింది. కానీ చూస్తూ చూస్తూ బంగారం లాంటి యిల్లు ఎలా వదులుకోవటం? మళ్ళీ ఇలాంటి సుఖాలతో యిల్లు చిక్కడం ఎంత కష్టం?

నా జ్వరం రెండు రోజుల్లో తగ్గింది. ఇల్లు అమ్మే ఆలోచనలో వున్నట్లు యజమానురాలు వ్రాసింది. ఎలా తెల్సిందో పేపర్లో ప్రకటన లేకుండా యిల్లు చూడటానికి ఎవ రెవరో రాసాగేరు.

సరిగ్గా యీ సమయంలో సిద్ధాంతిగారు మాయింటికి వచ్చారు. సిద్ధాంతిగారు సంస్కృతీ కళాశాలలో లెక్చరర్‌గా పని చేసి రిటైరయి, వాస్తు జ్యోతిష్కాలను వృత్తిగా చేసుకొన్నారు. సిద్ధాంతి గారికి నేనంటే వల్లమాలిన అభిమానం.

వాస్తు పరిశీలన నిమిత్తం ఇల్లు కొనదల్చుకొన్న వారెవరో ఆయన్ని పిల్చుకొచ్చారు. ఇల్లంతా చూచేరు. నన్ను ప్రొంటరిగా గది లోకి తీసికెళ్ళారు.

"మిత్రులు కనుక మీరు అడగకుండానే సలహా యిస్తున్నాను. ఈ యింట్లో మీరుంటున్నారని నాకు తెలియదు. కాని యిల్లు వాస్తురీత్యా మంచిదికాదు. ముఖ్యంగా మీ మేడ మీద పోర్షను అసలు వాస్తు విరుద్ధం. మీ పడకగది మార్చండి. ఆడ్దివాళ్ళు కనుక మీకంతగా బాధ లేదుకానీ, యీ యిల్లు కొన్న యజమాని సంవత్సరం తిరగక ముందే చస్తాడు. ఎందుకైనా మంచిది. వీలైనంత త్వరగా ఖాళీ చేయండి."

సిద్ధాంతిగారు నా మేలు కోరి సలహా యిచ్చినా, ఎందుకో ఆ సలహాలోని సత్యాసత్యాలు పరిశీలించాలన్న పట్టుదల పెరిగింది. ఇల్లు ఖాళీ చేయలేదు. పడకగదీ మార్చలేదు.

ఆ తర్వాతకూడా ఇల్లు చూడటానికి చాలామంది వస్తూనే వున్నారు. కానీ చాలా చీప్‌గా బేరాలు చేయసాగారు. అదేమంటే, "వాస్తు బాగాలేదటగా?" అనేవారు.

"సిద్ధాంతిగారు చెపితే వినని మీరు నా మాట వింటారా? నాస్తికులు-మొండివారు. అయినా ఆశ చంపుకోలేక ఆఖరిసారిగా అడుగుతున్నాను. నన్ను, పిల్లల్ని అన్యాయం చేయకండి. ఇల్లు మారదామండీ?"

చిత్రం! అందరూ అలా అనే కొద్దీ నాలో పట్టుదల పెరగ సాగింది. అప్పుడే సూర్యనారాయణ మూర్తి ఇల్లు చూడటానికి వచ్చాడు.

* * *

"ఆరేళ్ళుగా మీరీ ఇంటిలో వుంటున్నారటగా! ఇల్లు మంచిదేగా?"

సూర్యనారాయణ మూర్తి ఇంజినీర్. మంచి చెడ్డలు నన్నా అడగడం?

"పాతది అయినాగట్టిది. అయినా మీరు ఇంజినీర్ కదా!"

ఇంజినీర్ ఇంకేం ప్రశ్నలు వేయలేదు.

"ఇల్లుకూడా అమ్మేలా మీ పలుకుబడి వుపయోగించి యజమానులతో చెప్పండి. రిటైర్ అయ్యేదాకా నేను ఇక్కడికి రాను. ఇల్లు మామూలుగా మీరే మేనేజ్ చెయ్యాల్సివుంటుంది."

అది ఎర! చాలామంది చూపించారు నాకు!

నా సహాయం ఎంతవరకు పని

చేపిందో నాకు తెలియదు కాని, సూర్యనారాయణమూర్తిగారు ఎవరూ ఊహించని ధర పెట్టి కొనేశారు. తెల్లదో, నల్లదో-ఏదైతేనేం? లక్ష రూపాయల్లో ఇంటి యజమాన్యం మారింది. సూర్యనారాయణమూర్తి భార్య పార్వతమ్మ పేరిట కొన్నాడు ఇల్లు.

సూర్యనారాయణ మూర్తిగారికి ధన సంపాదన తప్ప మరో ధ్యాస లేదు. పార్వతమ్మ ప్రమాదకరమైన 'పిచ్చిది.' తనకి తెలియదు. ఎవరయినా ఏదైనా చెప్తితే కోపం.

ఆరు నెలలు తిరగక ముందే తాము వస్తున్నామని, పై పోర్షన్‌లో ఉంటామని వ్రాసేరు. నేను క్రింది పోర్షన్‌లోకి రాక తప్పలేదు.

"ఇల్లు కొనుక్కున్నారు. ఈ ఊరికి బదిలీ కూడా అయింది. అదృష్టం...." అని ఆయన్ని నేను అభినందించబోయాను.

"అబ్బే! నేను ఇక్కడ ఎంతో కాలం ఉండనండీ! 50 వేలు పోతే పోయింది- మంచి సెంటర్‌కి ట్రాన్స్‌ఫర్‌కు ప్రయత్నిస్తున్నా."

ట్రాన్స్‌ఫర్‌కే 50 వేలు లంచం ఇచ్చే పెద్ద మనిషి సంపాదన ఎన్ని లక్షల్లో వుంటుందో? అందుకే బేరాలాడకుండా లెక్కలేనట్లు ఇల్లు కొనేశాడు.

"ఏమండీ! వాళ్ళు వాస్తు చూసుకొన్నట్లు లేదు. మన బెడ్‌రూంనే వాళ్ళు బెడ్‌రూం చేసుకొన్నారు. సిద్ధాంతిగారు చెప్పింది వాళ్ళకు చెప్పండీ!"

సులోచన మంచితనంలో భాగం అది. కానీ కందకులేని దురద కత్తిపీటకా? వాళ్ళకి వాస్తు మీద నమ్మకం లేదేమో!

సూర్యనారాయణమూర్తి గారు ఆరునెలలు పై వాటాలో వున్నాడు. ఏమీ జరుగలేదు. కానీ క్రింది వాటాలో కొచ్చిన రెండు నెలల్లో మా ఇంట్లో దొంగలు పడి వున్న కాస్త సామానులు దోచుకుపోయారు.

"మనకీ ఇల్లు అచ్చిరాలేదండీ! ఇప్పటికయినా నా మాట వినండీ!"

అద్దెవాళ్ళం. మాకు అచ్చివచ్చేదేమిటి? సిద్ధాంతి చెప్పిన వాస్తు సిద్ధాంతం ప్రకారమవుతే సూర్యనారాయణమూర్తో, పార్వతమ్మో గుటుక్కుమనాలిగాని.

చిత్రమేమంటే బదిలీ అయి క్రొత్తగా వెళ్ళిన 'సెంటర్'లో సూర్యనారాయణమూర్తి క్వార్టర్స్‌లో దొంగలు పడ్డారు. ఎం పోయాయో ఏమో- పోలీస్ రిపోర్టు కూడా ఇవ్వలేదట.

"మాబారా! ఏదో రూపంలో

వాళ్ళను కొట్టింది. శాస్త్రమండీ...."

"నీ మొహం!"

సంవత్సరంలో మూర్తి మూడు 'సెంటర్' లు మారేడు. ఒక చోట కంటే మరో చోట బడ్జెట్ ఎలాట్‌మెంట్ జాస్తి.

ఈలోగా అటుపోతూ, ఇటు పోతూ ఎవరో ఒకరు వస్తుండే వారు. ఒకసారి పార్వతమ్మ వచ్చినప్పుడు సులోచనతో ఇంటి వాస్తును గురించి ప్రస్తావించింది.

"ఇంటి వాస్తు మంచిది కాదని ఊరంతా చెప్పుతున్నారు. కొనే ముందు మీవారు మా ఆయనకు చెప్పలేదేం?"

"వారికి అసలు అలాంటి వాటి పైన నమ్మకం లేదండీ! ఒట్టి నాస్తికుడు."

"ఆయనకు నమ్మకం లేకపోతే మాకు ఉండదూ? భలేవారే! అందుకే కామోసు ఇల్లు కొన్న దగ్గర్నుంచి మాకు అన్నీ బాధలే-నష్టాలే! ఒక్కటీ అచ్చి రావటం లేదు."

సులోచన మరేం జవాబివ్వ లేదు. మంచి శ్రోతగా మారింది.

"చూశారా! ఆఖరికి మనకి మాట వచ్చింది" అంది నాతో సాధింపుగా.

"మనకి మాటేమిటి? ఆ వెర్రి దానికి బుద్ధి లేకపోతే నీకు వుండొద్దూ?"

మరో రెండు నెలలకి మూర్తి కారు కొన్నాడు. కూతురికి అమ్మాయి పుట్టింది. కొడుక్కి పెళ్ళి కుదిరింది.

"యింకేం? తీవర మైందా? వాస్తు మహత్తు బాగానే వుంది."

ఉన్నట్లుండి అన్ని పోర్షన్ల వాళ్ళని ఖాళీ చెయ్యమని తాకీదులు వచ్చాయి. ఇలాంటి వుపద్రవం ఎపుడో ముంచుకొస్తుందని నేను వూహించాను. పార్వతమ్మది కోతి బుర్ర!

నేను అద్దె ఇంటి కోసం అన్వేషిస్తూంటే సులోచన జైలు నుంచి విముక్తి చెందుతున్నట్లు సంతోషించింది.

మూర్తికి మళ్ళీ బదిలీ అయింది. ఈతడవ బదిలీ ఆయనకు నష్టంలేనిది! సెలవుపెట్టి మరో చోటకి ప్రయత్నం సాగిస్తున్నాడు. ఈలోగా మేడపై వాళ్ళు ఖాళీచేస్తే అందులోకొచ్చి చేరారు మళ్ళీ.

"మేష్టారు! ఈ ఇంటికి వాస్తు మంచిది కాదని పార్వతి ఒకటే గోల పెడుతుంది. నిజమా?" ఓరోజు మూర్తి అడిగాడు నన్ను. నాకేం చెప్పాలో తోచలేదు.

"మీకు వాస్తుమీద నమ్మకం వుందా?"

"అదేం మాటండీ! మీకులేదా?"

"ఉహుఁ- మీకువుంటే ఆవన్నీ ఎందుకు విచారించుకోలేదు?"

"మీరు అవన్నీ చూస్తారను కొన్నానండీ! మీకే వదిలేశాగా చాలా విషయాలు?"

"నేను అలాంటివాటిని గురించి ఆలోచించనండీ! అయినా నాకు ఈ ఇంటిలో అంతా మంచే జరిగింది."

ఈ సంభాషణ జరిగిన వారం రోజులకి మూర్తికి జ్వరం తగిలినది.

"ఏమండీ! సిద్ధాంతిగారు చెప్పినది...."

"పిచ్చిగా వాగకు!" సులోచనపై చిరాకు పడ్డాను. కానీ మనసులో నాకూ పీకుతూనేవుంది. సిద్ధాంతిగారు చెప్పినట్లు ఒకవేళ జరిగితే?...

వారం గడచినా మూర్తి జబ్బు తగ్గలేదు. గదులు మార్చారు. జపాలు, అభిషేకాలు చేయించారు. ఒకరికి ముగ్గురు డాక్టర్లు ట్రీట్‌మెంట్ చేస్తున్నారు.

"మేష్టారూ! ఈ ఇల్లు కొన్న యజమాని సంవత్సరం తిరగక ముందే చస్తాడని మీకెవరో సిద్ధాంతిగారు చెప్పారుటగా? నాకు చెప్పాల్సిందండీ?"

ప్రాణభయం వలన ఎంత దైన్యంగా మాట్లాడుతున్నాడు? నిజంగా వాస్తుపట్ల నమ్మకంవుంటే అంత నిర్లక్ష్యంగా ఇల్లుకొనేస్తాడా?

కాగా అసలు ఇంటి యజమాని ఎవరు? కాగితాలలో పార్వతమ్మ యజమాని. డబ్బు చెల్లించింది ఆయన కావచ్చు. ఆ మాటకొస్తే ఆ డబ్బుమాత్రం ఈయన న్యాయంగా కష్టపడి సంపాయించిందా?

"అలాంటి ఆలోచన పెట్టుకోకండి మూర్తిగారు! మీకేం ఫర్వాలేదు. ఈ ఇంటిలో వున్నవాళ్ళందరికీ మంచే జరిగింది. మీరున్న ఈ పోర్షన్‌లో నేనెంతకాలం వున్నానో తెల్సుగా?" ధైర్యాన్ని ఆయన మనసులోకి ఎక్కించాను.

పదోరోజు ఆయన్ని హాస్పిటల్‌లో చేర్చారు. పదిహేనోరోజు జబ్బు తిరుగుముఖం పట్టింది.

"హమ్మయ్య!-బ్రతికేం!" నేనే మృత్యుముఖం నుంచి బయట పడ్డంతగా సంతోషించింది సులోచన.

"ఛీ- పాడు! ఇల్లు ప్రాణాల కంటే ఎక్కువా? అమ్మిపారేస్తా?" ఆ క్షణమే ఇల్లు అమ్మేసేలా అంది

పార్వతమ్మ.

మూర్తికి జబ్బు పూర్తిగా నయమైంది. ఆయన కోరుకున్న చోటుకి బదిలీకూడా అదే సమయంలో అయింది. ఇంటి గడప యినా త్రొక్కకుండా కొత్త సెంటర్లో జాయిన్ కావటానికి కారులో హస్పిటల్ నించి బయలుదేరాడు.

నాకు సరిగ్గా అపుడే ఇల్లు కొరికింది ఖాళీచేస్తున్నానని చెప్పటానికి వెళ్ళాను.

"ఎందుకు మేష్టారూ? కావాలంటే మీరిక్కడుండండి. మళ్ళీ వచ్చినపుడు వివరంగా మాట్లాడుకుందాం. అంతాకా వుంటారుగా?"

హాస్పిటల్‌నుంచి ఏదో సాహిత్య సభ వుంటే వెళ్ళి ప్రొద్దుపోయి కొంప జేరాను. మూర్తి ఇంట్లో వుండమనటం నాకు సంతోషంగా వుంది. కానీ ఆ వార్తవింటే సులోచన వుత్సాహమంతా చస్తుందే.... ఎలా చెప్పటం?

పై పోర్షనులో లైట్లులేవు. అంతా నిశ్శబ్దంగా వుంది.

తలుపు తట్టగానే తలుపుతీసింది సులోచన. నన్నుచూడగానే బిగ్గరగా ఏడ్చేసింది.

"ఏంజరిగింది?" భయంగానే అడిగాను.

"ఇంటి యజమాని కారు ప్రమాదంలో చనిపోయాడట! లబో దిబోమంటూ అంతా వెళ్ళారు." నన్ను కౌగిలించుకుని భయంతో, బాధతో చెప్పింది.

కొయ్యబారిపోయాను. ఆలోచనలు స్తంభించిపోయాయి!

"శాస్త్రిన్నే తేలికగా కొట్టేసేరుకాని, సిద్ధాంతిగారు చెప్పినట్లే జరిగింది. చూసేరుగా! పార్వతమ్మ ఇంటిని, మిమ్మల్ని తిట్టుకుంటూ వెళ్ళింది."

సులోచన వాదనను అంగీకరించబుద్ధి వేయలేదునాకు. పిలక్కీ పీర్ల పండక్కీ ఏమిటి? యాదృచ్ఛికంగా జరిగేవాటిని శాస్త్రానికి లంకె పెడితే ఎలా?

"నాకు చచ్చే భయంగావుంది. ఇక ఈ ఇంట్లో ఒక్క క్షణం వుండలేను. రేపే కాళీ చేసేద్దామండీ!"

సులోచన అభ్యర్థనను కాదనే ధైర్యం, నాకు లేదు. కానీ నా ఆలోచనలు మాత్రం, అంతటితో ఆగిపోలేదు! ✱

Edited & Published by VIJAYA BAPINEEDU
80 Dhanalaxmi Colony, Madras-600 026, and
Printed by him at Vijay Graphics;
1..-Arcot Road, Madras-600 026. Phone: 422233